క్లుప్తంగా

పండుగ శుభాకాంక్షలు



ఆలూరు సాంబశివారెడ్డి   వీరాంజనేయులు

శింగనమల: నియోజకవర్గంలో ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజినేయులు, మాజీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిలు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రజలందరూ సుఖ, సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ప్రతి కుటుంబం ధన, ధాన్యలతో తులనాడాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవెరెండ్ జీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. దేవుడిలాగే మనం కూడా పరిశుద్ధంగా జీవించాలన్నారు. క్రీస్తుకు చివరాంతం వరకూ మహిమకరంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా



జరిమానా విధిస్తున్న పోలీసులు

గుత్తి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐలు సురేష్, ఆశా బేగం, సిబ్బంది ఆదివారం పర్యటించి విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్, రాయల్ సర్కిల్, గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నో పార్కింగ్ ప్లేస్‌లలో వాహనాలు నిలిపిన డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులపై జరిమానా విధించారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే జరిమానాతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు



సీఐ కరుణాకర్

బుక్కరాయసముద్రం: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కరుణాకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో సంబరాలు చేసుకోవాలన్నారు. కోడి పందేలు, జూదం, పేకాట ఆడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేలు, జూదం, వ్యసనాలు జీవితాలు నాశనం చేస్తాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలతో పాల్గొనేవారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదన్నారు. కోడి పందేలు నిర్వహించినా, పందేల నిర్వహణకు భూములు, స్థలాలు ఇచ్చినా కఠిన చర్యలు తప్పవన్నారు. సంక్రాంతి పండుగ బంధువులతో సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. ఎక్కడైనా కోడి పందేలు ఆడినట్లు తెలిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆదివారం దిమ్మగుడి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం నిర్వహించారు. అలాగే ఆసుపత్రి వర్కర్లు, రోగులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ క్రిష్టారెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సంక్రాంతికి పప్పన్నం కరువాయె..





- తాడిపత్రి మునిసిపాలిటీలో కందిపప్పు కట్
- కూటమి ప్రభుత్వంపై పేదల మండిపాటు

తాడిపత్రి రూరల్: కొత్త సంవత్సరంలో వచ్చే తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతికి పేదలకు పప్పన్నం తినలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం జనవరి కోటలో తాడిపత్రి మునిసిపాలిటీకి కంది పప్పు కోత విధించింది. రేషన్ దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డులకు అందించాల్సిన కందిపప్పును సరఫరా చేయకపోవడం పట్ల పేద ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పెరిగిన ధరలతో పండగ కోసం ఏం కొనాలో, ఏం కొనకూడదో అయోమంలో ఉంటున్న ప్రజలకు రేషన్ దుకాణాలకు కంది పప్పు కోత విధించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ నాణ్యత కలిగిన కందిపప్పు ధర కిలో రూ.170 పలుకుతోంది. రేషన్ దుకాణాల ద్వారా కిలో రూ.67కు దొరుకుతోంది. పండుగ పూట కందిపప్పు కోత విధించడం ఏమిటని కూటమి ప్రభుత్వంపై పేదలు మండిపడ్డారు.

27,434 మంది కార్డుదారులకు కందిపప్పు కట్

తాడిపత్రి మునిసిపాలిటీలో 27,434 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి తాడిపత్రి మండలంలోని చిన్నపొలమడ గ్రామ పరిధిలోని పౌర సరఫరాల గోడౌన్ నుంచి కందిపప్పును రవాణా చేయాల్సి ఉంది. కార్డుకు కిలో చొప్పున మునిసిపాలిటీలో 54 మంది డీలర్లు దాదాపు 250 క్వింటాళ్లకు పైగా కంది పప్పు సరఫరా చేయాలి. జనవరి కోటాను తాడిపత్రి పట్టణానికి అధికారులు మినహాయించారు. గత నెలలో కందిపప్పు సరఫరా చేయడం వల్ల ఈనెల కోటను మినహాయించామని అధికారులు చెపుతున్నారు. మునిసిపాలిటీలోని పేద ప్రజలకు కేవలం బియ్యం, చక్కెరను మాత్రమే జనవరి కోటాను పరిమితం చేశారు. రేషన్ దుకాణాల ద్వారా 148 క్వింటాళ్ల చక్కెరను పంపిణీ చేస్తున్నారు.



పౌరసరఫరాల శాఖ గోడౌన్

డీలర్ల చేతివాటం

తాడిపత్రి మండలంలోని కార్డుదారులకు జనవరి కోటా కింద బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెరను పంపిణీ చేస్తున్నారు. మండలంలో 18,182 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. 39 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. గత నెలలో మండలానికి కందిపప్పు సరఫరా చేయలేదు. ప్రస్తుతం 220 క్వింటాళ్ల కందిపప్పు రవాణా చేశారు. కార్డుదారులకు 92 క్వింటాళ్ల చక్కెరను అందిస్తున్నారు. అయితే కందిపప్పు, చక్కెర సరఫరాలో కొందరు డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ప్రచారం ఉంది. కొన్ని చోట్ల కందిబెడలు లేవని, మరికొన్ని ప్రాంతాల్లో చక్కెర స్టాక్ అయిపోయిందని కార్డుదారులకు డీలర్లు మొండి చేయి చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సమస్యాత్మక గ్రామాల్లో ఒక వర్గం వారు మరో వర్గానికి చెందిన డీలర్ల వద్దకు వెళ్లి కందిపప్పు, చక్కెరను తీసుకోవడానికి విముఖత చూపుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని డీలర్లు నల్లబాజారుకు తరలిస్తూ లబ్ధి పొందుతున్నారు. అలాగే జనవరి కోటా జొన్నలు యల్లనూరు, పుట్లూరు, పెద్దపప్పూరు మండలాలకు మాత్రమే సరఫరా చేశారు. ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణాల్లో సరుకులు సక్రమంగా పంపిణీ పేద ప్రజలు కోరారు.

కార్డుదారుల వివరాలు ఇలా

మండలం	కార్డులు
యల్లనూరు	11,059
పుట్లూరు	11,472
పెద్దపప్పూరు	10,765
తాడిపత్రి	18,182
మునిసిపాలిటీ	27,434

కందిపప్పు ఇవ్వకుంటే ఎలా ?



స్టోర్‌లో జనవరి నెల కోటా కింద కందిపప్పు ఇవ్వలేదు. పేదలకు కందిపప్పు ఇవ్వకుంటే ఎలా. ఎక్కువ ధరలు పెట్టి దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.
– మాబున్ని, తాడిపత్రి

కందిబేడలు ఇవ్వలేదు



స్టోర్‌లో బియ్యం, చక్కెర మాత్రం ఇచ్చారు. కందిబేడలు అడిగితే స్టాకు రాలేదని డీలర్ చెప్పారు. కందిపప్పు పంపిణీ చేస్తారనుకున్నాను. సంక్రాంతికి పండుగకు కందిపప్పు ఇవ్వాల్సింది.
– గురుపాదమ్మ, తాడిపత్రి

ఫిబ్రవరిలో పంపిణీ చేస్తాం



తాడిపత్రి మునిసిపాలిటీకి ఫిబ్రవరి నెలలో కందిపప్పును పంపిణీ చేస్తాం. స్టాకు రాకపోవడం వల్ల రూరల్ ప్రాంతాలకు కందిపప్పు సరఫరాను పరిమితం చేశాం.
–శంకరయ్య, గోడౌన్ ఇన్‌చార్జ్

కరెంట్ బిల్లులను భోగి మంటల్లో వేయండి

గుంతకల్లుటౌన్: విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా కరెంట్ బిల్లులను భోగిమంటల్లో దగ్ధం చేసి ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై ప్రజలంతా నిరసన తెలియజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచబోనని ఎన్నికలకు ముందు ప్రకటించిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక కరెంట్ బిల్లులు ముట్టుకుంటేనే షాక్ కొట్టేలా పెంచి ప్రజల్ని మోసం చేశాడని మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపును విరమించుకునే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

ఆలూరు, వీరాకు సన్మానం



సాంబశివారెడ్డి, వీరాంజనేయులును సన్మానిస్తున్న నారాయణ, లక్ష్మీనారాయణ

శింగనమల/గార్లదిన్నె: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, మాజీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని పార్టీ అధికార ప్రతినిధి ఎస్.వి. నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ సన్మానించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారిని కలసి వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ఎంపికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాట సుంకులమ్మ సేవలో మాజీ ఎమ్మెల్యే



అమ్మవారికి మొక్కుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి శివారులో ఉన్న బాట సుంకులమ్మ అమ్మవారిని గుత్తి మాజీ ఎమ్మెల్యే నీలావతి దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నబాబు పాల్గొన్నారు.

భక్తులపై టీటీడీ బోర్డు వివక్ష వీడాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు: తిరుమల వెంకన్న దర్శనం కోసం వచ్చే సామాన్య భక్తులపై టీటీడీ బోర్డు వివక్ష వీడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు, టీటీడీ బోర్డు సభ్యులు ఇచ్చే సిఫార్సు లెటర్లు పొందిన భక్తులకు ఎల్–2 వరకు దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తారు. అదే కొన్ని గంటల పాటు క్యూలైన్ నిలబడే భక్తులకు మాత్రం చాలా దూరం నుంచి దర్శనం కల్పిస్తారు. గతంలో ఈ వివక్ష లేదని అందరిని ఎల్–2 గేట్ వరకూ దర్శనం కలిగించేవారన్నారు. అదే గోల్డ్ టెంపుల్, పూరిలోని జగన్నాథ్ ఆలయం, జమ్ములోని వైష్ణవి మాత దేవాలయాల్లో ఇలాంటి పద్ధతి లేదన్నారు. ఇటీవల తిరుపతిలో భక్తుల మృతి ఘటనలో పాలక మండలం సభ్యులు, ఎగ్జిక్యూటివ్ అధికారి నిర్లక్ష్యం స్పష్టంగా కనబడిందన్నారు. తిరుమలకే అప్రతిష్టత, మచ్చ తెచ్చే విధంగా టీటీడీ బోర్డు వ్యవహరించదని విమర్శించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని టీటీడీ బోర్డులో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే సీఎం చంద్రబాబు పేదలకు అర్బన్ ఏరియాల్లో 2 సెంట్లు, రూరల్ ఏరియాల్లో 3 సెంట్లు స్థలం ఇస్తామన్నారు. ఇంతవరకూ అమలుకు నోచుకోలేదు. ఈ విషయమై ఈ నెల 20 మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్దిదారులతో ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ, రూరల్ అధ్యక్షులు గోపీనాథ్, రాముదాయల్, సహయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, నాయకులు వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ సేవలు అభినందనీయం



దివ్యాంగులకు కృత్రిమ చేతులను అందజేస్తున్న దాతలు

గుంతకల్లు టౌన్: పోలియో, వివిధ ప్రమాదాల ద్వారా కాళ్లు, చేతులు కోల్పోయిన దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్‌ను భారత్ వికాస్ పరిషత్ అందజేయడం అభినందనీయమని నగర ఉత్సవ సమితి కోశాధికారి ఇల్లూరు లక్ష్మీనారాయణ, వ్యాపారవేత్త సత్రసాల సురేష్‌గుప్త కొనియాడారు. ఆదివారం వేంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిబిర శాశ్వత దాత ఎం.భాస్కర్ రంగయ్య, విజయలక్ష్మి దంపతుల సౌజన్యంతో తయారు చేయించిన కృత్రిమ కాళ్లు, చేతులు కాలిపర్స్‌ను 26 మంది దివ్యాంగులకు ఉచితంగా అందజేశారు. కొన్నేళ్లుగా వివేకానంద జయంతి రోజున భాస్కర్ రంగయ్య దంపతులు నిర్వహిస్తున్న సామాజిక సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ వేల్పూరి ప్రభాకర్, వేంకటేశ్వర ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, సభ్యులు జయంతి వెంకట్, సుదర్శన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



గుత్తిలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని జడ్ వీరారెడ్డి కాలనీలో ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి నిర్మల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో బాలికలు, మహిళలు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు సంక్రాంతి పండుగ రోజు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బహుమతులు ప్రధానం

తాడిపత్రి అర్బన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక అంభాభవాని ఆలయంలో స్వకుశసాలి సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లోని విజేతలకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన కర్నూలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాచురే సునీతభాయ్ విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లే నాగేష్, పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు మంజువాణి, కార్యదర్శి చంద్రకళ, సఫరే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువుకు సన్మానం

గుత్తి: పట్టణంలోని గుత్తి కోటలో ఆదివారం యోగా గురువు కృష్ణయ్యను గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు, యోగా శిక్షకులు ఘనంగా సన్మానించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, గౌరవాధ్యక్షుడు బాబా సాహెబ్, శిక్షకులు కృష్ణయ్యను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా కృష్ణయ్య వేలాదిమందికి యోగా నేర్పించారన్నారు.

బీసీ, ఈబీసీ వర్గాలకు శుభవార్త

పామిడి: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ వర్గాల ప్రజలకు ప్రభుత్వం శుభవార్త తెలిపినట్లు ఎంపీడీఓ తేజోత్స్న ఆదివారం తెలిపారు. పామిడి మండలానికి సంబంధించి రెండు జనరిక్ మందుల షాపులకు బీసీ–1, ఈబీసీ–1 యూనిట్లను కేటాయించిందన్నారు. అలాగే స్వయం ఉపాధి కింద బీసీ–42, ఈబీసీ–4 చొప్పున టార్గెట్ కేటాయించారన్నారు. ఆసక్తిగల బీసీ, ఈబీసీ కులస్తులు APOBBMS పోర్టల్‌లో ఈనెల 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చీరల పంపిణీ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వివేకానంద పాఠశాలలో ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయ సేవాసమితి ఆధ్వర్యంలో వివేకానంద జయంతి, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గురప్ప, గౌరవ అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్ నారబోయిన శంకర్, ప్రెసిడెంట్ నాగభూషణరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడులో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంప్ నుంచి పట్టణానికి చెందిన వెంకటరాముడు ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో.. పోలీస్ శాండ్ టీం అధికారులు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనంతరం ట్రాక్టర్‌ను పట్టణ పోలీసులకు అప్పగించడంతో సీఐ సాయి ప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో శాండ్‌టీం పోలీసులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సరుకుల పంపిణీ



శింగనమల: మండలంలోని తరిమెల గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ ఓబిలేసు సంక్రాంతి పండుగ సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత, వైఎస్సార్‌సీపీ నాయకుడు తరిమెల వంశీ గోకుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సరస్వతి డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమేళనం నిర్వహించారు. కళాశాలలో 2007–2010లో డిగ్రీ(బీఎస్సీ) చదివిన విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. గురువులను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జేసీ రవికుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం గుర్తు తెలియని కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన రవికుమార్, మసూద్ పని నిమిత్తం గుత్తికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో తాడిపత్రి వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు బంధువులు అనంతపురానికి తరలించారు. కాగా బైక్‌ను ఢీకొన్న కారు ఆపకుండా వెళ్లిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన కారు కోసం గాలిస్తున్నారు.

యల్లనూరుకు ఎస్ఐ కావలెను

- మండలంలో గాడితప్పుతున్న శాంతిభద్రతలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

యల్లనూరు: మండలంలో ఎస్ఐ లేకపోవడంతో శాంతిభద్రతలు గాడితప్పాయి. యల్లనూరులో ఎస్ఐగా విధులు నిర్వహించాలంటే కత్తిమీద సాము. మండలంలో 21 పంచాయతీలు 36 గ్రామాలు, 36 వేల మంది జనాభా ఉంటున్నారు. పలు గ్రామాలు అత్యంత సమస్యాత్మకంగా ఉన్నాయి. అయితే మండలానికి రెగ్యులర్ ఎస్ఐ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఫ్యాక్షను ప్రభావిత గ్రామాల్లో పోలీస్ పర్యవేక్షణ లేక శాంతభద్రతలు గాడితప్పాయి. యల్లనూరు, పుట్లూరు మండలాల బాధ్యతలు ప్రస్తుత సీఐ సత్యబాబుపై భారం పడింది. దీంతో మట్కా, పేకాట రాయుళ్లకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. నెల రోజుల కిందట ఎస్ఐ శ్రీరాం ప్రసాద్‌ను జిల్లా ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు. డిసెంబరు 26న నూతన ఎస్ఐగా రామిరెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. బాధ్యతలు తీసుకున్న రెండోరోజే ఆయనను సైతం వీఆర్‌కు పంపించారు. ఇలాంటి ఘటనలు చూసి ఒక్క ఎస్ఐ కూడా యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదు.



యల్లనూరు పోలీస్‌స్టేషన్

పెరిగిన అసాంఘిక కార్యకలాపాలు

ఎస్ఐ లేకపోవడంతో మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అలాగే కింది స్థాయి పోలీసుసిబ్బంది ఆడింది ఆట...పాడింది పాటగా మారింది. సీఐ సత్యబాబు అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు ఆరుగురికి గాను ముగ్గురు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన ముగ్గురు ట్రాఫిక్ డీఎస్పీ వద్ద ఒకరు, ఒకరు పీసీఆర్, ఒకరు ఆర్ఎఫ్‌యస్ఎల్‌లో ఉన్నారు. కానిస్టేబుళ్లు 21 మంది ఉండాల్సింది. కేవలం ఐదుగురు విధుల్లో ఉన్నారు. వారిలో ఒకరు స్పెషల్ పార్టీలో ఉన్నారు. మిగిలింది నలుగురే. ఆ నలుగురితో స్టేషన్ నడుపుతున్నారు.

18,19న జాతర

జనవరి 18, 19 తేదీల్లో యల్లనూరులో పెద్దమ్మ జాతర ఉంది. ఎన్నో సంవత్సరాల నుంచి ఈ జాతర జరుగలేదు. ప్రస్తుతం పెద్ద మనుషులు జనవరిలో జరిపేందుకు నిర్ణయం తీసుకున్నారు. యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. అరకొర సిబ్బందితో జాతర జరుపలేమని జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

త్వరలో ఎస్ఐని నియమిస్తాం

త్వరలో ఎస్ఐని నియమిస్తాం. సిబ్బంది కొరత ఉంది. 21 మందికి గాను ఐదుగురు కానిస్టేబుళ్లు ఉన్నారు. జిల్లా ఎస్పీ జగదీష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పాటు పోలీసు సిబ్బందిని నియమించి చిన్నపాటి సమస్య లేకుండా చూస్తాం.
– వెంకటేశ్వర్లు,డీఎస్పీ, అనంతపురం రూరల్

మల్లీశ్వరస్వామి సేవలో జడ్జి

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన కమల మల్లీశ్వరస్వామి ఆలయాన్ని కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ ఆదివారం సందర్శించారు. ఆలయం చుట్టూ ఆమె ప్రదక్షిణలు చేసి స్వామికి పూజలు నిర్వహించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220732, 9912220722, 9908363676